
చిరు నవ్వొచ్చింది—
అది తెల్లని ముత్యంలా లేదు—
ఎర్రని పగడం కాదు.
నేరం చేసినవాడు నిస్సహాయంగా
స్వగతంలో ఏడ్చిన నవ్వు—

# ఎండమావులు

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి



అడవిలో కార్చిచ్చు కొన అంటుకున్న వెదురు పొద చిరు మంట.

* * *

ఎండ మండిపోతోంది.

'దహ్-టు-బర్న్-ఫస్ట్ కాంజుగేషన్ పరస్మై పది. దీని కృదంత రూపం దాహః' అని తల ఎత్తి చూశాడు వ్యాకరణ పండితుడు, బి. ఏ ఫైనలియర్ క్లాసులో. అలసి తలలు వాల్చినకొమ్మలూ, రెమ్మలూ, వాడి వత్తలైన లేత తీగలూ, కనపించాయి పండితుడికి. అతని నోరెండిపోయింది.

అతను చిన్నగా నవ్విన నవ్వు అది. ఇట్టినేరం ఇంకెప్పుడూ చెయ్యకూడదనుకున్నాడు.

* * *

జాహ్నవి టక్కున లేచి నిలుచుంది.

ప్రశ్నార్థకంగా చూశాను.

తర్వాత జమున, ఆమె వెంట గిరిజ—ఎవ్వరూ మాట్లాడరు. మెల్లగా అతి మెల్లగా క్లాసులో నుంచి బయటికి వెళ్ళిపోయారు. అదృష్టం బాగుండి వెంటనే గంట కొట్టారు.

"దహ్-టు-బర్న్" వెంటాడుతుండగా స్టాఫ్ రూమ్‌లోకి వచ్చాను. మంచినీళ్ళ కుండ. దివాలాతీసినవాడి మొహంలా తెల్లబోయి చూస్తున్నది. ఇంటి తోవ పట్టాను. పక్క లేడీ స్టూడెంట్స్ వెయిటింగ్ రూమ్ నుంచి ముగ్గురూ తలవంచుకు వస్తున్నారు. జాహ్నవి నన్ను చూసి సిగ్గుపడి దూరంగా వెళ్ళిపోయింది.

* * *

పైన నిర్మోహ మాటంగా నల్ల మబ్బు చారికైనాలేని తెల్లని ఆకాశం—కింద విశాలంగా విసుగ్గా పరుచుకున్న కంకర తోవ. కొంతదూరం నడిచి పైకి చూస్తే, అధికార్లకి పెట్టిన అప్లికేషన్లలా నీటి చుక్కరాల్చక, తెగపరిగెత్తే తెల్ల మేఘాలు. మైదానం మీద దూరంగా జిల జిల మిలమిల ఎండ ధాటికి మెరిసే ఎండమావులు. మా ఆశలకు, ప్రతిబింబాలు. "ఏ మృగతృష్ణనో తలచి ఏడ్చెదు." అన్న ఏదో పురాతన కంఠం చెవుల్లో గింగురుమంటే చట్టున నలువైపులా ఉలికిపడి చూశాను. ఏమీలేదు. శూన్యం.

చిన్న బజారువెంట నడుస్తున్నాను. ఒక చోట కుళ్ళినపళ్ళరాశి మీద పోగుపడ్డ ఈగల్లా, చౌకబియ్యం డిపో దగ్గర, మెలిదిరిగిన తాడులా ఏర్పడబోయి, తొక్కిసలాడే జనంలా మూగిన మనుషులు—అబ్బే! మనిషికి విలువలేదు. ఎంత పలచబడి చులకనై దేనికో ఎగబడుతున్నారు! తనకన్నా విలువైనదీ, దైవంలా దర్శించదగ్గదీ, ఆ పదార్థం ఏమిటో తెలిసి చావడంలేదు. మురికి పావడాలు. చింకివోణీలు మాసిన చీరలు, చింపిరి తలలు, ఊడిన జడలు,

## సుభాషితాలు

నీవు ఒక వ్రేలితో ఒకర్ని చూపెడుతున్నప్పుడు తిరిగి 4 వ్రేళ్ళు నిన్ను చూపెడుతున్నాయి అన్న మాట మరువకు.

— బైబిల్

* * *

జీవితం అంటే ఒకర్ని ఒకరు నమ్మించి మోసగించటం. అందర్నీ అందరూ మోసగించుకోవడం.

— షేక్స్‌పియర్

* * *

నేనెప్పుడూ మనుష్యులతో స్నేహం చెయ్యను. వారు సాయం చెయ్యని కృతఘ్నులు కనుక. సాయంచేసే చెట్లు. పక్షులు, పూవులే నా స్నేహితులు.

— మేఖవిల్లి

* * *

విద్యావంతుడు విద్యావంతుణ్ణని చెప్పుకోవడంతోనే విజ్ఞానాన్ని కోల్పోతున్నాడు.

— గోర్కీ

* * *

యౌవనం ఒక మహా ప్రవాహం లాంటిది. దానికి సరియైన ఆనకట్ట కట్టి ఆ నీటిని మళ్ళించినపుడే జీవితం ధన్యమౌతుంది.

— రామకృష్ణ పరమహంస

* * *

జననం వలెనే మరణంకూడా—అడుగు వేసి తీస్తేనేకదా నడక.

— బైబిల్

* * *

సేకరణ:
**కోట రామకృష్ణ**

---

# ఎండమావులు

గళ్ళలుంగీలు, కట్‌బనీన్లు, అటువైపే నడుస్తున్నాయి. అన్నిటి భుజాలమీద చంకల్లో, తలలమీద ఒకటో రెండో కడవలు, సెరవలు—

మర్యాదా, అంతస్థుకొద్దీ ఎంత పట్టించుకోకుండా దూరంగా ఉందామనుకున్నా, నామీద ఆవహించి ఉన్న సాటి మానవత్వం టంగున ఎక్కడో తీగమోగినట్టు మోగింది.

ఎట్లాగో తోవ చేసుకుని ఆ పద్మవ్యూహంలో తల దూర్చాను. అక్కడొక పాత గదికి అమర్చిన పైపు. చిటికెనవేలి లావంత సన్నంగా సంశయిస్తూ కారే నీరు— దాని చుట్టూ గోవర్ధన పర్వతమంత ఎత్తు కడవలు, బిందెలు, డ్రమ్ములు—

ఆ వేలి ధారకింద కడవపెట్టి ఓపిగ్గా చూస్తున్న నలభై ఏళ్ళ ఆడమనిషిని, పాతికేళ్ళ మనిషి వచ్చి అమాంతం తోసేసి నీరుజారే కడవ లాగేసి, యుద్ధం ప్రకటించింది. తానేమో గంట ముందే వచ్చి తన సెరవ అక్కడ పెడదామనుకుందిట. రానూ వచ్చిందట. ఎవరో పిలిస్తే పక్కకు వెళ్ళిందట. ఇంతలో రెండవామె చటున ఆక్రమించిందట. అదీ తగవు. వాళ్ళు పంపు ఒదిలి ఇవతలికి రారు. ఇంకొకరిని పట్టుకోనివ్వరు, ఒకరి జుట్టు ఒకరు వదలరు. ఏమి మానవ మనస్తత్వం! కలిమిలో ఏమీ పట్టించుకోనివారు! ఉదారంగా ఉండేవారు, అక్కా చెల్లీ అని పిలుచుకునేవారు, ఈ కరువులో ఎంత శత్రులయిపోయారు! స్వార్ధం నిక్షేపంలాంటి మానిసులను ఎంత పిశాచులను చేస్తున్నది! చెరిగిన జుట్టు, కరిగిన బొట్టు, చెమర్చిన వొళ్ళు; చూస్తూనుంచున్నాయి. "మనకెందుకు!" మనస్తత్వంమనుషులను ఎంత హీనులనుచేసింది? తలవొంచుకు వచ్చేశాను.

ఆ సురక్షిత తిరోగమనంతో ఇల్లు కనపడింది.

* * *

నాలుగురోడ్ల మొగ. రంయిన వచ్చి ఒక నీటి టాంకర్ మధ్యగా ఆగింది. వందలకొద్దీ జనం పోగవుతున్నారు. నాలుగు వీధులకు నడుమ ఎత్తుగా నిలిచిన గాంధీమహాత్ముడు, తన ఇండియాలో స్వరాజ్యం వచ్చిన పాతికేళ్ళకైనా త్రాగడానికి గుక్కెడు మంచినీళ్ళకోసం ప్రజలుతన్నులాడడం చూడలేక కళ్ళు మూసుకోబోతే, ఆ కళ్ళు మూతపడలేదు. ఆ కళ్ళలో నీళ్ళు ఎండిపోయి ఎన్నాళ్ళో అయింది!

టాంకర్ మీదకు జనం ఒకటే ఎగబడుతూఉంటే మృదవర్లు కొందరు జనాన్ని తాడులా ఒకరివెంట ఒకర్ని నిలబెట్టబోయారు. ఆ తాడు ఉన్నట్టే ఉండి మళ్ళా చుట్టుకుపోవడం మొదలుపెట్టింది. ఇళ్ళలో ఉన్న కడవలు, బిందెలు, బొక్కెనలు, గుండిగలు, గిన్నెలు. ఉగ్గుగిన్నెలు సైతం వరసగా కూర్చున్నాయి. విసుగెత్తి లేచి నిలుచున్నాయి. చప్పున చతికిలబడ్డాయి. వాటి నోళ్ళు తడవలేదు. ముందున్న 'మోతుబరి గంగాళాల' దాహం తీరలేదు. నగలమెడలు, జరీ చీరలు, కొత్తసిగలు, వరసను లెక్కచేయక ఏర్పరచిన సూత్రాన్ని ఛేదించి ముందుకు వచ్చి, కావలసినంత నీరు పట్టుకుతప్పుకున్నాయి, పిల్లగాళ్ళు, అలగాజనం నీటి వంతువచ్చేసరికి హారన్ మ్రోగి, టాంకరు పరుగెత్తుకుపోయింది.

జనం చెల్లాచెదరైపోయారు. వట్టి కడవలు, కుండలు బోర్లించుకుని నిరాశగా పోతున్నారు చిల్లరజనం.

పెద్దది కల్లమ్మ, పదేళ్ళ కొండయ్యని పంపింది. రెండు రోజులనుంచి ఆ ఇల్లు నల్లని నీటిమొహం చూడలేదు. కూడుడకడానికి నీరు లేదు. చిరచిర మండే మొహంమీద చల్లుకుందామంటే నీటికి దరిద్రం గదా! కుండెడు నీళ్ళు సంపాదించలేని కొడుకుమీద కల్లమ్మ మండిపడింది—బోసి కడవ బోర్లించి తెచ్చే కొడుకును చూసి, తల్లి కడుపు మండిపోయింది. కుండ తీసి వాడి తలమీద వేసికొట్టింది. కుండ నాలుగు చెక్కలయింది. వాడితల చిట్లి నెత్తురు చిమ్మింది.

* * *

ఇల్లు కనబడింది—అమ్మయ్య— స్నానం చేసి స్తిమితపడాలి. భోజనం తర్వాత మాట. చూస్తూనే ఇల్లాలు కవి హృదయం గ్రహించి, 'క్షణంలో రావాలి గంగ' అంది. 'జీవితం వ్యంగ్య వైభవమ్!' సహవాస దోషం—లేదని ఛస్తేచెప్పదు.

కన్నతల్లిలా సర్వులకు ఆత్మీయం కావలసిన ప్రకృతిమాత, ఈశ్వరుని ఏకైక ప్రసాదం, మనుషులకు ఎంతదూరమై ఎరుసైపోయింది?

"భూమి రాపోఽ నలో వాయుః ఖం
ఇతీయంమే భిన్నా ప్రకృతి రష్టధా"

పై అయిదూ నా రూపమే అన్నాడట గీతలో కృష్ణుడు. ఆ శరీరాన్ని అందరూ అనుభవించకుండా గళ్ళగాచేసి. ముక్కలుగాకోసి కొంటున్నాం. అమ్ముతున్నాం. భూమి, వాయువు, తేజస్సు, ఆకాశం అన్నీ 'జబ్బపుష్టిగల' వాళ్ళ అధీనం అయ్యాయి. నేటికి అప్పులు (నీళ్ళ) గతికూడా అంతే అయింది. అప్పుచేసి పంపుతేనే, అప్పులు దొరుకుతున్నాయి. లేనివాళ్ళకులేవు. అప్పు పుట్టింది. పొదుపుగా మజ్జన భోజనాదులుచేసి మేను వాల్చాను. చల్లని స్నానం వెచ్చని భోజనం, మెత్తని కనురెప్పలమీద నిద్ర ఊగుతోంది.

మరచిపోయినవి మరాపురనివి ఏవో బొమ్మలు కళ్ళల్లో—

చిన్నప్పుడు చదువుకున్న ఒక పల్లెటూరు. ఊరునిండా తోటలు. ఊరికి ఎడాపెడా ఒక కాలవ. ఒకపుణ్యనది. ఉదయం నదీస్నానం, సంధ్యావందనం. సాయంత్రం కాలవ షికారు. ఊళ్ళోని కుర్రకారు ఇంచుమించంతా కాలవగట్టుకు చేరేది. విశాలమైన పడవల కాలవ గట్టుమీంచి నీట్లోకి అమాంతం దూకి మునిగిపోవడం. ఆ మునిగిన వాణ్ణి ఇంకొకడు నీళ్ళలో మునిగి తరు

ముకుంటూ పైకితేలకుండానే పట్టుకోవడం. కాలువ ఒడ్డున ఉన్నవాళ్ళందరికీ అదోఆట. అరటి బొందలు కడుపుకింద ఆన్చుకుని పిల్లలంతా నీటి పక్షుల్లా విసుగూ విరామం లేకుండా ఈదుతున్నారు.

సూర్య గ్రహణం, అంతా నదిలో స్నానాలు. నాకు 13 ఏళ్ళు. ఇద్దరాడ పిల్లలతో నేనూ వెళ్ళాను. వాళ్ళతో నీళ్ళు ఎగజిమ్ముతూ కాలుజారి నీళ్ళలోపడ్డాను. వాళ్ళిద్దరూ సాహసించి ముందుకుదూకి ఒడ్డుకు లాగివేశారు. వాళ్ళకి నీళ్ళంటే భయంలేదు. అమ్మ ఒళ్లో ఆడుకున్నట్టే. అంత నీరు, జీవనం, భువనం, వనం, హఠాత్తుగా నా కళ్ళలో ఎండిపోయింది. చిట్టడవులు, బొంతరాళ్ళు, ప్రత్యక్షమైనాయి.... అట్లా-అట్లా.....

* * *

పనిపడి పేదపాలెం మీదుగా పోతున్నాను. ఎగుడు దిగుడుగా చుట్టు గుడిసెలతో నిండిన ఆ చోటును జనారణ్యం అనడం సబబు. మంటిముద్దలు, కొన్ని బొంతరాళ్లు గుద్రంగా పేర్చి, ఆ గోడమీద నాల్గు తాటాకులో, బండి తడికలో, చిరుగు గోనెపట్టాలో కప్పి, ఆ గోడలకు కచ్చికచ్చిగా సున్నం పూసిన ఆ గుహలకు వాళ్ళ పరిభాషలో "ఇల్లు" అని పేరు. ఆ ఇళ్ళముందు కొందరు తలలొంచుకొని ఏవో పనులు చేసుకొంటున్నా, కొందరు దిగులు ముఖాలతో వీధిలోను, గుమ్మాల్లోను నిలబడి దేనికో ఆదుర్దాగా ఎదురు చూస్తున్నారు. రెండురోజులకు మళ్ళా ఈ రోజు నీళ్ళ దర్శనం అవుతుందేమో అని ఆశ—

ధన్‌ధన్ మని చప్పుడుచేసుకుంటూ పక్కవీధిలోకి ఒక నీళ్ళలారీ వస్తున్నది. జనం మొహాలు సంతోషంతో విప్పారాయి—అంతా చేతికి దొరికిన పాత్రలు తీసుకుని పరుగెత్తారు.

"నీ నోరుబడా! చూస్తావేండిరా. నేను పెద్దముండను. నడుసుకుండాబొయ్యేతలికి ఆ లారీ కాస్త లగెత్తుతాది-నీటిచుక్క చూసి రెండ్రోజులైంది, ఆ కడవెత్తుకోని పోరా తొరగా. నేను వెంబడే వస్తుండా" అని కంగారుగా కల్లమ్మ తన పదేళ్ళకొండె గాణ్ణి ఎచ్చరించింది. కొండయ్య చేతికందిన కడవ తీసుకుని లారీవైపు లగెత్తి దూసుకుపోయాడు. "ఇయ్యేళ, ఎట్లాఅబ్బినా-ఒక కడవనీళ్లు!-అమ్మ-నల్లనినీళ్లు సంపాదించాల" ఇదీ వాడి శరా. లారీ ఆగలేదు.

జనంగుంపును దూసుకుని ఆగ మేఘాల మీద ఎగిరిపోతున్నది.

జనం అట్టుడికినట్టు ఉడికిపోతున్నారు.



అరిచారు. మొత్తుకున్నారు. ఆగలేదు—

పదిగజాలు వెళ్ళింది—అంతే—కర్‌ర్ మంటూ ఈడ్చుకుంటూ ఆగిపోయింది—

ఆశ్చర్యంతో జనం తటపటాయించి, తండోపతండాలుగా లారీవెంట పడ్డారు. లారీ టాంకరునుంచి నీరు జారే పైపు మూత మూసివేసి ఉంది. ప్రజలు ఒకటే రొద—గోల—కోలాహలం—ఏమాట వినపడదు.

"టక్, టక్, టక్" మూత ఎవరో పగలగొట్టివేశారు. ఏనుగుతొండం లావున నీరు చిమ్ముకుంటూ ఎగిరిపడుతున్నది. రోజుల తరబడి రాత్రుళ్ళంతా ఆ తెల్లని చల్లని నీటికోసం జాగరణ చేసినవాళ్ళకు, రోజుల తరబడి చల్లని నీటికి ముఖం వాచిన వాళ్ళకు, ఒళ్ళు తెలియలేదు. అంత నీరు ఒక్కచోట అంత దగ్గరగా చూసి ఎన్నాళ్ళయిందో. జనం పిచ్చెద్దిపోయింది. పొంగి పొంగి వచ్చే నీటిలో మునిగిపోయారు. మొగంనిండా తలనిండా చిమ్ముకున్నారు. దోసిళ్ళతో తనివితీరా తాగారు. ఎగజిమ్మారు. కడవలనిండా, కుండలనిండా, దుత్తలనిండా నింపుకున్నారు.

"అయ్యో నా కొడకా, కొండా, ఎక్కడున్నావురోరి నాయనా" అని అప్పటికి లారీ దగ్గరకు చేరిన కల్లమ్మ ఆక్రందనంతో జనం పిచ్చి దిగిపోయింది. అప్పటికి, నిజస్థితి వారికి గుర్తుకువచ్చింది అంతా లారీ ఇంజనువైపు పరిగెత్తారు. కొండయ్య లారీ చక్రం కింద చేతిలోని కడవతోసహా తల పగిలి నెత్తురుమడుగులో ఉన్నాడు. డ్రైవరు కేబిన్‌లోంచి ఎప్పుడు జారుకున్నాడో ఎవ్వరికీ తెలియదు.

కొండయ్య ప్రాణాలు నీళ్ళుగా మారి, ఆ రోజు అందరి దాహం తీర్చాయి.

మరి రేపు?

ఎండమావులు!!

★


వివాహాది శుభకార్యములకు

భారతీయ కళా నైపుణ్యతకు ప్రసిద్ధిగాంచిన



బెనారస్, ధర్మవరం, కంచి, ఆరణి

నెపోలియన్ వెండి జరీతో తయారు చేయించిన న్యూమోడల్ పట్టుచీరలు, 644 నైలెక్సు లక్నో ఎంబ్రాయిడరీ చీరలు పరిక్రొత్త స్టాకు వచ్చియున్నవి.

వేడే దయచేయండి.

Specialist in Wedding SAREES

ASHOK STORES

GOVERNOR PET * VIJAYAWADA-2.

